క్లుప్తంగా

నాణ్యమైన భోజనం అందించాలి



ధర్పల్లి: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ మాలతి నిర్వాహకులకు సూచించారు. మండలంలోని రామడుగు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో భోజనం నాణ్యతను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందిస్తున్నారా అని విద్యార్థులను ఆమె అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు.

తప్పిదాలు లేకుండా సర్వే చేయాలి



ధర్పల్లి: ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో తప్పిదాలు లేకుండా చూడాలని ఎంపీడీవో బాలకృష్ణ సిబ్బందికి సూచించారు. మండలంలోని మద్దుల్‌తండాలో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. తప్పిదాలకు తావు లేకుండా వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేయాలన్నారు. సాధ్యమైనంత తొందరగా సర్వేను పూర్తి చేయాలన్నారు. సర్వేకు వచ్చిన అధికారులకు లబ్ధిదారులు పక్కా సమాచారాన్ని తెలియజేయాలని సూచించారు.

ధాన్యం డబ్బులు చెల్లించండి

జక్రాన్‌పల్లి: కొలిప్యాక్ సొసైటీ పరిధిలో విక్రయించిన ధాన్యానికి సంబంధించిన డబ్బులను వెంటనే చెల్లించాలని మనోహరాబాద్ రైతులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు శుక్రవారం కొలిప్యాక్ సొసైటీకి తరలివచ్చి, నిరసన తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి ధాన్యం డబ్బులు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ధాన్యం డబ్బులు విడతల వారీగా రైతుల ఖాతాలో జమా అవుతున్నాయని సొసైటీ కార్యదర్శి దయాసాగర్ తెలిపారు. రైతులు రొద్ద రవి, రొద్ద రాజ్‌కుమార్, పబ్బ రాజ్‌కుమార్, లక్ష్మణ్, దాసు, శివ తదితరులు పాల్గొన్నారు.

మూలమలుపుల వద్ద జాగ్రత్తగా ఉండాలి



నిజామాబాద్ రూరల్: వాహనదారులు మూలమలుపుల వద్ద జాగ్రత్తగా ఉండాలని రూరల్ ఎస్‌హెచ్‌వో మహ్మద్‌ఆరీఫ్ తెలిపారు. మల్లారం ప్రాంతంలోని మూలమలుపుల వద్ద ఉన్న పొదలను శుక్రవారం ఆయన ట్రాక్టర్‌తో శుభ్రం చేయించారు. ఈసందర్భంగా ఎస్‌హెచ్‌వో మాట్లాడుతూ.. మల్లారం గండి ప్రాంతంలో ప్రమాదకరంగా మూలమలుపులు ఉన్నాయని ప్రయాణికులు ప్రమాదాలకు గురికాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మూలమలుపుల వద్ద వాహనదారులు నెమ్మదిగా వెళ్లాలని అన్నారు.

విద్యార్థులు పరిశుభ్రతను పాటించాలి



నిజామాబాద్ రూరల్: విద్యార్థులు స్వీయ పరిశుభ్రతను పాటించాలని మండల విద్యాధికారి సేవ్లా సూచించారు. మండలంలోని గుండారం ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో పిల్లలకు అయోడిన్ లోపం వల్లే వచ్చే రుగ్మతల గురించి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. జిల్లా కోఆర్డినేటర్ సమత, అసిస్టెంట్ ప్రొఫెసర్ జీజీహెచ్ డాక్టర్ ఉమరా, డాక్టర్ కవిత, అమర్నాథ్ హెచ్‌ఎం సాయిలు తదితరులు పాల్గొన్నారు.

మెప్మా ఆర్పీల అరెస్టు



నిజామాబాద్ సిటీ: రాష్ట్రంలో పనిచేస్తున్న రిసోర్సుపర్సన్స్ (ఆర్పీ)ల సమస్యల పరిష్కారం కోసం చలో హైదరాబాద్ వెళ్తున్న పలువురు మెప్మా ఆర్పీలను పోలీసులు అరెస్టు చేశారు. నగరం నుంచి హైదరాబాద్ వెళుతున్న పలువురిని శుక్రవారం ఉదయం పోలీసులు అడ్డుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మరికొందరిని గృహనిర్బంధం చేశారు. అయినా కొందరు ఆర్పీలు గురువారం సాయంత్రమే హైదరాబాద్ వెళ్లి కార్యక్రమంలో పాల్గొన్నారు. దీంతో వారిని మాసబ్ ట్యాంక్ పరిసర పోలీసు స్టేషన్‌లకు తరలించి మధ్యాహ్నం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

ఇంటింటికి నల్లా ఏదీ?

- నగరంలో 99వేల నివాస గృహాలు
- నల్లా కనెక్షన్లు 40వేలు
- కొత్త కాలనీలకు మున్సిపల్ నీరు కరువు

నిజామాబాద్ సిటీ: నగర కార్పొరేషన్‌లో ఇంటింటికి నల్లా కనెక్షన్ ప్రకటనలకే పరిమితమవుతోంది. నగరంలో కొత్తగా ఏర్పడ్డ కాలనీల్లో మున్సిపల్ నీరు జాడేలేదు. పాత పైప్‌లైన్లతోనే మున్సిపల్ అధికారులు నీటిని సరఫరా చేస్తున్నారు. నూతన పైప్‌లైన్లు లేకపోవడంతో నగరవాసులకు స్వచ్ఛమైన నీరు అందటం లేదని పలువురు పేర్కొంటున్నారు.

నిజామాబాద్‌మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో దాదాపు 99 వేల నివాస గృహాలున్నాయి. అందులో కేవలం 40 వేల నల్ల కనెక్షన్‌లు ఉన్నాయి. అపార్టుమెంట్లలో నివసించేవారు దాదాపు 20 శాతం మంది. నగర పరిధిలో ఇండస్ట్రీలు అంతంత మాత్రమే. కొత్తగా వచ్చిన పరిశ్రమలేం లేవు. షాపింగ్ మాల్స్, సినిమా హాళ్లు, ఫంక్షన్‌హాల్ నిర్వాహకులు వాటిని నిర్మించేముందే నల్లా కనెక్షన్‌లు తీసుకుంటున్నారు. అయితే గృహావసరాలకు వినియోగించే నీటికే పెద్ద సమస్యగా మారింది. గతంలో పబ్లిక్ నల్లాలుండేవి. వీధిల్లోని కుళాయిల వద్ద మున్సిపల్ నీరు సరఫరా అయ్యేది. స్థానికులు ఆ నల్ల నీటిపై ఆధారపడేవారు. ప్రస్తుతం రోడ్ల నిర్మాణం, రోడ్ల విస్తరణ కారణంగా చాలావరకు వీధి నల్లాలు తొలగించారు. అయితే ప్రతి ఇంటికి రూ.1కే నల్ల కనెక్షన్ ఇవ్వాలని ప్రభుత్వం యోచించింది. పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. కానీ వారికి కనెక్షన్‌లు ఇవ్వడంలో అధికారులు విఫలమవుతున్నారు.



మున్సిపల్ కార్యాలయం

కొత్త కాలనీలకు ఇబ్బందే..

నగరంలో కొత్తగా వెలుస్తున్న కాలనీలకు మున్సిపల్ నీరు రావడం లేదు. ప్రధాన రహదారి, పెద్ద గల్లీల్లో, రోడ్డుకు సమీపంగా ఉండే ఇళ్లకు మాత్రమే నల్లా కనెక్షన్‌లు ఉన్నాయి. రోడ్డులోపల ఉండే ఇళ్లకు కనెక్షన్ ఇవ్వడం లేదు. పైపులైన్లు కూడా లేవు. నల్లా కనెక్షన్ తీసుకోవాలంటే రోడ్డు నుంచి లోపలివరకు అయ్యే ఖర్చును వారే భరించాలి. దీంతో కొత్తగా వెలుస్తున్న కాలనీవాసులు తాగునీటి కోసం వాటర్ ప్లాంట్‌ల వారు సరఫరాచేసే డబ్బా నీళ్లపైనే ఆధారపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నగరమంతటా మున్సిపల్ నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని, నూతన పైప్‌లైన్లు వేయాలని నగరవాసులు కోరుతున్నారు.

దరఖాస్తు చేసుకున్నా ఇవ్వలే..

గాయత్రినగర్‌లో కొత్తగా నల్లా కనెక్షన్‌లు ఇవ్వడం లేదు. దరఖాస్తు చేసుకున్నా వాటిని పరిష్కరించడం లేదు. దీంతో వాటర్‌ప్లాంట్‌లో దొరికే నీటిపైనే ఆధారపడుతున్నాం. ప్రతీరోజు రూ.50 తాగు నీటికే ఖర్చుచేస్తున్నాం.

–విద్యాసాగర్, గాయత్రినగర్

పైప్‌లైన్ ఉంటే సులభం..

నల్లా కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి కనెక్షన్‌లు ఇస్తున్నాం. ఇదివరకే నల్లా పైప్‌లైన్ ఉంటే కనెక్షన్ ఇవ్వడం సులువు. కానీ పైపులైన్ లేని గల్లీల్లో కనెక్షన్ ఇవ్వడానికి సమయం పడుతుంది. లోపలికి ఉంటే దరఖాస్తుదారుడే చార్జీలు భరించాలి.

–మోహన్, వాటర్ వర్క్ ఇన్‌స్పెక్టర్, నిజామాబాద్

ఉద్యోగ భద్రత కల్పించాలి

నిజామాబాద్‌అర్బన్: తమకు ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనాలు అమలు చేయాలని సమగ్రశిక్ష ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు నగరంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. నిరసనల్లో భాగంగా శుక్రవారం సమగ్ర శిక్ష ఉద్యోగులు ఎన్‌టీఆర్ చౌరస్తాలో మానవహారం నిర్వహించారు. ఎస్ఎస్ఏ, కేజీబీవీలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, పీడీఎస్‌యూ ప్రధాన కార్యదర్శి గణేష్ వారి దీక్షకు సంఘీభావం ప్రకటించారు. తెలంగాణ ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు హేమలత, ప్రధాన కార్యదర్శి సుమలత, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈశ్వరి పాల్గొన్నారు.



నగరంలోని ఎన్‌టీఆర్ చౌరస్తాలో మానవహారంగా ఏర్పడ్డ సమగ్రశిక్ష ఉద్యోగులు

ధర్నాను జయప్రదం చేయండి

నిజామాబాద్‌అర్బన్: హైదరాబాద్‌లో ఈనెల 17న తపస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) రాష్ట్ర బాధ్యులు రామకృష్ణారెడ్డి అన్నారు. నగరంలోని మాణిక్ భండార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కాంప్లెక్స్ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం భారతితో కలిసి ఆయన ధర్నా పోస్టర్లను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. సమస్యలను పరిష్కరించాలన్నారు. నాయకులు సురేందర్, కీర్తి సుదర్శన్, దీప, వెంకటరమణ, సరిత,రమాదేవి, రజిని, నీరజ, శోభ ,గంగాధర్, ప్రసన్న, లక్ష్మీ అలివేలు,అనురాధ తదితరులు పాల్గొన్నారు

టీచర్‌ను సస్పెండ్ చేయాలి

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని దుబ్బ హైస్కూల్‌లో విద్యార్థిని కొట్టిన ఉపాధ్యాయురాలిని సస్పెండ్ చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. నగరంలోని నీలం రామచంద్రయ్య భవన్‌లో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టీచర్ విద్యార్థి చెయ్యి విరిగేలా కొట్టడం సరికాదన్నారు. నాయకులు దేవిక, మనోజ్, రాజు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం ప్రతి ఒక్కరికి ప్రాథమిక హక్కు

నిజామాబాద్ నాగారం: ఆరోగ్యం ప్రతి ఒక్కరికి ప్రాథమిక హక్కు అని ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి అన్నారు. నగరంలోని మెడికవర్ ఆస్పత్రి మెడికవర్డ్ ఫ్యామిలీ కార్డును శుక్రవారం ఏసీపీ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కుటుంబ కార్డు వంటివి నాణ్యమైన ఆరోగ్యాన్ని సామాన్యులకు మరింత చేరువచేయడానికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. మెడికవర్ సెంటర్ హెడ్ స్వామి, మార్కెటింగ్ హెడ్ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనలు పాటించాలి

నిజామాబాద్‌అర్బన్: కళాశాల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి రవికుమార్ అన్నారు. నగరంలోని ఆల్ఫోర్స్ కళాశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. కళాశాల సిబ్బంది, యాజమాన్యంతో సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఇంటర్ బోర్డు నిబంధనల మేరకు ప్రతి కార్యాలయ రిజిస్టర్లన్నీ కూడా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎలాంటి తప్పిదాలు దొర్లకుండా చూడాలన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తగా ప్రతి అంశంపై శ్రద్ధ వహించాలని అన్నారు. నిబంధనలను అతిక్రమించిన ఏ కళాశాలపై అయిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. సమావేశంలో ప్రిన్సిపాల్, సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



డిచ్‌పల్లి: రాష్ట్రస్థాయి సీనియర్ బేస్‌బాల్ పోటీలకు ఇందల్వాయి గ్రామానికి చెందిన కొటాల శ్రీకర్ ఎంపికై నట్లు బేస్‌బాల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మధుసూదన్‌రెడ్డి, సొప్పరి వినోద్ శుక్రవారం తెలిపారు. శ్రీకర్ ఎస్ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం సీఈసీ చదువుతున్నాడని వారు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన శ్రీకర్‌ను జిల్లా సాఫ్ట్ బాల్ ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగామోహన్, కోచ్ నరేష్ అభినందించారు.

అల్లు అర్జున్ అభిమానుల రాస్తారోకో



నిజామాబాద్ రూరల్: నగరంలోని విజయ్ థియేటర్ వద్ద శుక్రవారం అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులు రాస్తారోకో చేశారు. హైదరాబాద్‌లో అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేయడాన్ని వారు ఖండిస్తూ నిరసన తెలిపారు.

విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ



నిజామాబాద్ నాగారం: నగరంలోని మాణిక్ భవన్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థినులకు రోటరీ క్లబ్ ఆఫ్ జెమ్స్ ఆధ్వర్యంలో సైకిళ్లు పంపిణీ చేశారు. మాణిక్ భవన్, గుండారం, శంకర్ భవన్ ప్రభుత్వ పాఠశాలలతో పాటు ఆర్చిడ్, సెయింట్ జేవియర్ పాఠశాలల విద్యార్థులకు సైకిళ్లు అందజేశారు. వైద్యులు భూంరెడ్డి, క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు పద్మ శ్రీనివాస్, గౌరీ శంకర్, ఉపాధ్యక్షులు వీరబ్రహ్మం, సభ్యులు గిరీష్ కుమార్, కోటగిరి చంద్రశేఖర్, గంజి రమేష్, రాజశేఖర్ పాల్గొన్నారు,

ఒలింపిక్‌సంఘం రాష్ట్రఉపాధ్యక్షుడికి సన్మానం



నిజామాబాద్ నాగారం: జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈగ సంజీవరెడ్డి ఇటీవల జరిగిన రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ ఎన్నికల్లో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈసందర్భంగా ఆయనను శుక్రవారం పెబ్బేరు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భూచ్చరెడ్డి, రంగారెడ్డి పెబ్బేరు సొసైటీ చైర్మన్, మహబూబ్‌నగర్ జిల్లా ఎన్‌డీసీసీ డైరెక్టర్ సన్మానించారు. మాస్టర్‌మైండ్ పాఠశాల ప్రిన్సిపాల్ లావణ్యరెడ్డి, మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ అనిఫ్ తదితరులు పాల్గొన్నారు

బాపూజీ వచనాలయం సభ్యుడికి..



నిజామాబాద్‌రూరల్: నగరంలోని బాపూజీ వచనాలయం కార్యవర్గ ఎన్నికల్లో అరెట్టి లక్ష్మీ నారాయణ సభ్యుడిగా ఇటీవల ఎన్నికయ్యారు. ఈసందర్భంగా గీత భవనం కార్యవర్గ సభ్యులు శుక్రవారం ఆయనను అభినందించి సన్మానించారు. నరేందర్‌రావు షిండే, ఎంఎస్ నరసింహారావు, కార్యదర్శి మేడిచర్ల ప్రభాకర్ రావు, వేంకటస్వామి, చంద్రశేఖరశర్మ, బొడ్డు దయానంద్, శంకర్ పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడికి..

నిజామాబాద్ సిటీ: యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన విపుల్‌గౌడ్‌ను శుక్రవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో పలువురు నేతలు సన్మానించారు. నాయకులు మహ్మద్ ఖాజా, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ల అందజేత



ఖలీల్‌వాడి: నగరంలోని రెండవ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో నలుగురు బాధితులకు పోగొట్టుకున్న సెల్ ఫోన్లను ఎస్సై యాసీన్ ఆరాఫత్ శుక్రవారం అందజేశారు. ఎస్సై మాట్లాడుతూ.. సెల్‌ఫోన్ పోగొట్టుకున్నవారు పోలీస్‌స్టేషన్ వచ్చి ఫిర్యాదు చేసి, సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. దీంతో బాధితులకు సెల్‌ఫోన్ దొరికే అవకాశాలు ఉన్నాయన్నారు.

15నుంచి జిల్లాస్థాయి విశ్రాంత ఉద్యోగుల క్రీడాపోటీలు

నిజామాబాద్ నాగారం: నగరంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 15నుంచి అఖిల భారత పెన్షనర్స్ డే సందర్భంగా జిల్లా స్థాయి ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు మామిడ్యాల రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. 15న ప్రారంభోత్సవ కార్యక్రమానికి నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ వస్తున్నారన్నారు. మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్, అడిషనల్ డీసీపీ(అడ్మిన్) బస్వారెడ్డిలు వస్తున్నరన్నారు. 17న క్రీడల ముగింపు కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అడిషనల్ కలెక్టర్ అంకిత్, రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, నుడా చైర్మన్ కేశవేణు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ దశరథ్, జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ పాల్గొననున్నట్లు తెలిపారు. పోటీల్లో రిటైర్డ్ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థులకు అభినందన



మోపాల్: మండల కేంద్రంలో బయోలాజికల్ సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి పరీక్షపోటీల్లో ప్రతిభ కనబర్చిన మంచిప్ప జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని ప్రతిభను ఎంఈవో గేమ్‌సింగ్ శుక్రవారం అభినందించారు. ఉపాధ్యాయులు బేతాళ సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండలో..

సిరికొండ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బయోలాజికల్ సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షలో రావుట్ల జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. రాకేష్ ప్రథమ స్థానంలో, రాజేశ్వరి ద్వితీయ స్థానంలో నిలిచారు. విద్యార్థులను కాంప్లెక్స్ హెచ్‌ఎం సతీష్, హెచ్‌ఎంలు శ్రీనివాస్, సంధ్యారాణి, పోశెట్టి, ఉమాశేఖర్ అభినందించారు.

లబ్ధిదారులకు తులం బంగారం ఇవ్వాలి

- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ
- నగరంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

సుభాష్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీమేరకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కుతోపాటు తులం బంగారం ఇవ్వాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ డిమాండ్‌చేశారు. నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆడబిడ్డ పెళ్లి భారం కాకుండా ప్రభుత్వం ఆర్థికసాయం కింద రూ.1,00,116 ఇవ్వడం సంతోషమన్నారు. కానీ కాంగ్రెస్ ఇచ్చిన తులం బంగారం హామీ ఏడాది గడుస్తున్నా.. అమల్లోకి రాకపోవడం బాధాకరమన్నారు. తులం బంగారం వెంటనే ఇవ్వాలని అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తానని పేర్కొన్నారు. అదే విధంగా చెక్కుల జారీ విషయంలో జాప్యం జరగకుండా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని అసెంబ్లీలో విజ్ఞప్తి చేస్తానని తెలిపారు. మొత్తం నిజామాబాద్ సౌత్, నార్త్ మండలాలకు చెందిన 801మంది లబ్ధిదారులకు రూ.8,01,92,916 కోట్ల విలువైన చెక్కులను ఆయన అందజేశారు. కార్పొరేటర్లు, నాయకులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



నగరంలో లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

గోమాతను రక్షించుకోవాలి

డిచ్‌పల్లి: గోమాత లేకుంటే సనాత ధర్మమే లేదని, గోవును రక్షించుకోవల్సిన బాధ్యత అందరిపై ఉందని అఖిల భారత గోసేవ ఫౌండేషన్ అధ్యక్షుడు బాలకృష్ణ అన్నారు. గోవును రాష్ట్రమాతగా ప్రకటించాలని కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు మహా పాదయాత్ర చేపట్టిన బాలకృష్ణ శుక్రవారం డిచ్‌పల్లికి చేరుకోగా, ఆయనకు కాశీ విశ్వనాథ ఆలయ కమిటీ ప్రతినిధులు, సుహాసినులు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. గోమాతను రక్షించుకోవాలని రాష్ట్ర మాతగా ప్రకటించాలనే సంకల్పంతో ఇప్పటివరకు 14 రాష్ట్రాల మీదుగా 180రోజుల్లో 4,900 కిలోమీటర్ల పాదయాత్ర చేసినట్లు తెలిపారు. డిచ్‌పల్లిలో తనకు స్వాగతం పలికి, గోమాత సంరక్షణకు మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఇంటి లోపలే కులం బయటికొస్తే మన ధర్మం కోసం పనిచేసే హైందవ వీరులం కావాలని పిలుపునిచ్చారు. ప్రతీ భారతీయుడు గోవును కాపాడుకోవాలని, ఆవు విశ్వానికి మాత అని బాలకృష్ణ పేర్కొన్నారు.



డిచ్‌పల్లిలో మాట్లాడుతున్న అఖిల భారత గోసేవ ఫౌండేషన్ అధ్యక్షుడు బాలకృష్ణ

న్యాయం చేయాలి



నిజామాబాద్‌నాగారం: నగరంలోని ఆర్‌కెఆర్ అపార్టుమెంట్‌లో ప్లాట్లు కొనుగోలు చేసి వారికి న్యాయం చేయాలని అపార్టుమెంట్ వాసులు గాదారి గోపి, నగేష్ అన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం వారు మాట్లాడారు. నిజామాబాద్ కలెక్టరేట్ బైపాస్ రోడ్‌లో ఆర్కెఆర్ అపార్టుమెంట్‌కు బైపాస్ రోడ్డు నుంచి దారి ఉందని నమ్మించి ప్లాట్‌లను అమ్మి బిల్డర్ మోసం చేశాడన్నారు. ఎమ్మెల్సీ కవిత మామ రామ్‌కిషన్‌రావు తన అనుచర బలగంతో బెదిరిస్తూ అపార్టుమెంట్ వైపు ఉన్న ప్రధాన గేటును కబ్జా చేస్తున్నారని, ఇదేమిటని ప్రశ్నిస్తే నివాసితులపైన దాడులకు పాల్పడుతున్నారన్నారు. రోడ్డు ఉందని నమ్మించి, నాణ్యత లేకుండా అపార్టుమెంట్ నిర్మించి తమకు అప్పగించిన అటల్ బిల్డర్స్ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం కాంగ్రెస్ నాయకుడు ఆదె ప్రవీణ్ అపార్టుమెంట్ వాసులకు సంఘీభావం తెలిపారు. అపార్టుమెంట్ యజమానులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సుభాష్‌నగర్: నగరంలోని తిలక్ గార్డెన్, కొత్త హౌజింగ్ బోర్డు, కలెక్టరేట్, సుభాష్‌నగర్‌లో సబ్‌స్టేషన్ల నిర్వహణ, మరమ్మతుల కారణంగా శనివారం కరెంట్ సరఫరాలో అంతరాయం ఉండనున్నట్లు టౌన్–2 ఏడీఈ ప్రసాద్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఖలీల్‌వాడి, ఎల్లమ్మగుట్ట, పోలీస్ లైన్, పోచమ్మగల్లి, ప్రగతినగర్, గాంధీచౌక్, కుమార్ గల్లి, హత్తై గల్లీ, కసాబ్‌గల్లి, అజామ్‌రోడ్, వీక్లీ మార్కెట్, ఉప్పర్ టేక్డీ, బస్టాండ్ రోడ్, రైల్వేస్టేషన్ రోడ్డు, హమాల్‌వాడీ, సుభాష్‌నగర్, బ్యాంక్ కాలనీ, గంగస్థాన్–1, కేసీఆర్ కాలనీ, విద్యుత్ నగర్, న్యూ హౌజింగ్ బోర్డు కాలనీ, తారక్‌రామ్ నగర్, మారుతీనగర్, రోకడ్ హనుమాన్, నీలకంఠేశ్వర్ కాలనీ, గణేష్‌నగర్, కస్తూరి గార్డెన్, చంద్రశేఖర్ కాలనీ, పాముల బస్తీ, కంఠేశ్వర్, తదితర ప్రాంతాల్లో నేడు ఉదయం 9గం.ల నుంచి 11గం.ల వరకు విద్యుత్‌ను నిలిపేస్తున్నట్లు పేర్కొన్నారు.

వినాయక్‌నగర్‌లో..

వినాయక్‌నగర్‌లో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని టౌన్–1 ఏడీఈ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. సాయికృపనగర్, 100 ఫీట్స్ రోడ్, పంచముఖి హనుమాన్ రోడ్, దత్తాత్రేయ ఆలయం, తుల్జాభవానీ టెంపుల్, గూడెం రోడ్ ప్రాంతాల్లో ఉదయం 9.30 గం.ల నుంచి 12.30 గం.ల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	220	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	79,700	వెండి(కిలో)	95,500
22 క్యారెట్స్	73,550		

– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	25	50	గాజరుగడ్డ	50	70
బెండకాయ	30	50	పచ్చిమిర్చి	25	40
జీరకాయ	40	60	దోసకాయ	30	50
దొండకాయ	35	60	ఆలుగడ్డ	35	50
బీర్నీసుకాయ	35	60	గోబిగడ్డ	25	50
కాకరకాయ	30	60	గోబిపువ్వు	50	90
వంకాయ	10	20	బీట్‌రూట్	50	90
పాలకూర	20	40	కరివేపాకు	50	70
మెంతికూర	20	40	చామగడ్డ	35	60
కొత్తిమీర	30	50	గోరుచిక్కుడు	35	60
పుదీనా	50	80	చిక్కుడుకాయ	30	60
క్యాప్సికం	60	90			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	పుష్ప-2(తెలుగు)-1.30,7.00
స్క్రీన్-2	మిస్‌యూ(తెలుగు)-10.40 ,1.20,7.50,10.30
స్క్రీన్-3	పుష్ప-2(తెలుగు)-11.0,4.30,10.00

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	పుష్ప-2(తెలుగు)-10.00,2.05, 6.10,10.15
స్క్రీన్-2	ఫియర్(తెలుగు)-11.45 మిస్‌యూ(తెలుగు)-2.20 పుష్ప-2 (తెలుగు)-5.10 9.15
స్క్రీన్-3	ప్రణయ గోదారి(తెలుగు)-11.10 పుష్ప-2(హిందీ)- 2.20 6.25 10.30
స్క్రీన్ -4	పుష్ప-2(హిందీ)-10.00 పని(తెలుగు) -2.05 మిస్‌యూ-5.10 10.35 ఫియర్(తెలుగు)- 10.35
లలితామహల్	మిస్‌యూ (తెలుగు)
దేవి	పని(తెలుగు)
నటరాజ్	పుష్ప-2 (హిందీ)
విజయ్	పుష్ప-2 (తెలుగు)